సాక్షి
ఖమ్మం
సోమవారం । 19 । ఫిబ్రవరి । 2024



మన నీళ్లు మంచివే!

జిల్లాలోని నాలుగు మండలాల్లో భూగర్భ జల శాఖ అధికారులు నీటి శాంపిళ్లు పరీక్షించగా సాగుకు ఉపయుక్తమైనవేనని తేల్చారు. 8లో



రెండు టన్నుల చేపలు లూటీ

చెరువుమాధారం చెరువు చేపలను తమకు విక్రయించడం లేదనే ఆగ్రహంతో స్థానికులు రెండు టన్నుల చేపలు లూటీ చేశారు. 8లో

గరిష్టం / కనిష్టం
35° / 19°

వాతావరణం

జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. తెల్లవారు జామున, రాత్రి వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

రేపు డీడీఎన్ అర్చకుల 'చలో సెక్రటేరియట్'

ఖమ్మంగాంధీచౌక్: ధూప దీప నివేదన(డీడీఎన్) అర్చకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం చలో సెక్రటేరియట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీడీఎన్ జిల్లా అధ్యక్షులు మునగలేటి రమేష్ శర్మ, ప్రధాన కార్యదర్శి మరిగంటి భార్గవాచార్యులు, కోశాధికారి అన్నావజ్జల ప్రసాద్ శర్మ తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారొక ప్రకటన విడుదల చేశారు. డీడీఎన్ అర్చకులకు కనీస వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, నూతనంగా నియమితులైన వారికి ఏడు నెలల వేతనాలు అందించాలని కోరారు. డిమాండ్ల సాధన కోసం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవ శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం అందిస్తామని పేర్కొన్నారు.

ఏసీపీల బదిలీలు

ఖమ్మంక్రైం : ఖమ్మం కమిషనరేట్‌లో మరోసారి ఏసీపీల బదిలీలు జరిగాయి. హైదరాబాద్‌లోని ఐటీ సెల్‌లో డీఎస్పీగా పనిచేస్తున్న బి.శ్రీనివాసులును ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీగా బదిలీ చేశారు. ఏసీబీలో డీఎస్పీగా పనిచేస్తున్న కె.శ్రీనివాస్‌రెడ్డిని ఖమ్మం సీటీసీ ఏసీపీగా నియమించారు. బదిలీ అయిన ట్రాఫిక్ ఏసీపీ సారంగపాణికి మరోసారి స్థానాన్ని మార్పు చేశారు. ఆయనకు మొదట హైదరాబాద్ ఎస్‌బీ ఏసీపీగా బదిలీ చేసి, ఆ తర్వాత హైదరాబాద్‌లోనే సీసీఎస్ ఏసీపీగా నియమించారు. మళ్లీ ఇప్పుడు ఎస్‌బీకే బదిలీ చేశారు. ఇక సత్తుపల్లి ఏసీపీగా బదిలీ అయిన రామానుజంను మొదట డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ప్రస్తుతం ఆయనను కరీంనగర్ పీటీసీ ఏసీపీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

జాతీయ అథ్లెటిక్స్‌లో జిల్లాకు పతకాలు



సాధించిన పతకాలతో క్రీడాకారులు

ఖమ్మంస్పోర్ట్స్ : గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన బి.వైశాలి, కె.మస్తాన్‌లకు పతకాలు లభించాయి. బాలికల పెంటాథ్లిన్‌లో బి.వైశాలి బంగారు పతకం దక్కించుకోగా.. కె.మస్తాన్ 600మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులను డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి కె.సారంగపాణి, కోచ్ ఎండీ.గౌస్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం బాధ్యులు ఎండీ.షఫీక్ హమ్మద్, ఎం.సుధాకర్, కృష్ణయ్య అభినందించారు.

నేడు మేడారానికి మంత్రి పొంగులేటి

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం జిల్లాతో పాటు మేడారంలో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు శ్రీశ్రీ సర్కిల్‌లోని తన నివాసం నుంచి బయలుదేరి 9.30 గంటలకు కూసుమంచి చేరుకుని సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొంటారు. 10.30 గంటలకు హెలికాప్టర్ ద్వారా బయలుదేరి 11.10 గంటలకు మేడారం చేరుకుంటారు. 11.15 గంటలకు సమక్క-సారలమ్మలను దర్శించుకుంటారు. 11.30 గంటలకు సమక్క-సారక్క దేవాలయం వద్ద మీడియా టవర్‌ను ప్రారంభిస్తారు.11.45 గంటలకు మీడియా సమావేశంలో పాల్గొంటారు. 12 గంటలకు ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభించి, 12.15 గంటలకు హరిత హోటల్‌లో జాతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షలో పాల్గొంటారు. 2 గంటలకు హెలీకాప్టర్ ద్వారా బయలుదేరి 3.10 గంటలకు హైదరాబాద్ చేరుకుంటారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్య కల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్య కల్యాణ వేడుక ఆదివారం నేత్ర పర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

అభయహస్తం తిరిగొచ్చేనా?





నిధుల కోసం మహిళల ఎదురుచూపులు

- నగదు వాపస్ చేస్తామని గత ప్రభుత్వం హామీ
- కొత్త సర్కారైనా విడుదల చేయాలని వేడుకోలు
- నిధులు వస్తే ఉమ్మడి జిల్లాలో 2.14 లక్షల మందికి లబ్ధి

ఖమ్మంమయూరిసెంటర్: స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉంటూ.. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల కోసం మహిళలు అభయహస్తం పథకానికి డబ్బులు చెల్లించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసింది. తద్వారా మహిళా సభ్యుల పిల్లలకు ఉపకార వేతనాలు, వృద్ధాప్యంలో పింఛన్‌తో పాటు ప్రమాదవశాత్తు మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. తక్షణ సాయంగా అంత్యక్రియలకు రూ.5 వేలు ఇచ్చేవారు. అయితే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడడం, తెలంగాణలో కొత్త ప్రభుత్వ పాలన ప్రారంభమైన తర్వాత అభయహస్తం పథకాన్ని నిలిపివేసింది. దీంతో అప్పటి వరకు అభయహస్తం కింద డబ్బు చెల్లించిన మహిళలు తమ నగదు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వచ్చారు. దీంతో గత ప్రభుత్వం 2022 మార్చిలో అభయహస్తం కింద నగదు చెల్లించిన మహిళలను గుర్తించి, వారికి తిరిగి చెల్లించాలని నిర్ణయించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 2,14,987 మంది ఈ పథకానికి నగదు చెల్లించారు.

పథకం ప్రారంభమైందిలా..

అభయహస్తం పథకాన్ని 2009లో ప్రారంభించగా.. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉండి 18 నుంచి 60 ఏళ్ల లోపు మహిళలను అర్హులుగా గుర్తించారు. పొదుపు సంఘాల్లోని సభ్యులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర రెడ్డి ఈ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. మహిళా సభ్యులు ఏటా రూ.365 చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం రూ.360 జమ చేస్తుండేది. జమ చేసిన డబ్బులతో 60 ఏళ్లు నిండిన తర్వాత అభయహస్తం పథకం పింఛన్ కింద ప్రతినెలా రూ.500 చొప్పున చెల్లించేవారు. ఐదేళ్లపాటు వృద్ధులకు రూ.500 చొప్పున పింఛన్ చెల్లించారు. ఆ తర్వాత ప్రత్యేక రాష్ట్రం ఏర్పడడం, ప్రభుత్వం మారడంతో రాష్ట్రంలో ఆసరా పెన్షన్ అమలు చేయడం, వృద్ధాప్య పింఛన్ కింద రూ.2,016కు పెంచడంతో ఈ పథకం మూలన పడింది.

2,14,987 మంది సభ్యులకు..

అభయహస్తం కింద తాము చెల్లించిన డబ్బును తిరిగి ఇవ్వాలని చాలాకాలం నుంచి మహిళలు కోరుతున్నారు. డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు కట్టిన డబ్బుకు వడ్డీతో కలిపి ఇవ్వాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఖమ్మం జిల్లాలో 1,36,656 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 78,331 మంది అభయహస్తం పథకం కింద నగదు చెల్లించారు. మొత్తంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,14,987 మంది అభయహస్తం లబ్ధిదారులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సభ్యుల వివరాలు, వారి బ్యాంక్ ఖాతా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

రెండేళ్లు అవుతున్నా..

అభయహస్తం పథకంలో నగదు చెల్లించిన మహిళలకు తిరిగి నిధులు ఇవ్వాలని గత ప్రభుత్వం నిర్ణయించి రెండేళ్లు అవుతోంది. తమకు ఇంకా ఎప్పుడు డబ్బు చెల్లిస్తారోనని మహిళలు ఆశగా ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం హామీ ఇచ్చి రెండేళ్లు కావస్తున్నా నేటికీ తమ ఖాతాల్లో డబ్బులు జమకాకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు కొత్త ప్రభుత్వమైనా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సొమ్ము తిరిగి చెల్లించాలి..



అభయహస్తం కింద పదేళ్ల క్రితం నగదు చెల్లించాం. ప్రభుత్వం మారిన తర్వాత పథకాన్ని నిలిపివేశారు. మేము చెల్లించిన నగదు మాకు తిరిగివ్వలేదు. డబ్బులు తిరిగిస్తామని చెబుతున్నారే తప్ప ఇప్పటి వరకు ఇవ్వలేదు. మా సొమ్ము తిరిగి చెల్లించాలి.

– అరిపిన్ని వీరకుమారి, పండితాపురం

ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నాం..



2009 నుంచి అభయహస్తం పథకం కింద నగదు చెల్లించాం. తెలంగాణ వచ్చిన తర్వాత ప్రభుత్వం ఈ పథకాన్ని ఆపివేసింది. దీంతో మేము చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరాం. ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నాం. కొత్త ప్రభుత్వం అయినా మా డబ్బులు తిరిగి చెల్లించాలని కోరుతున్నాం.

– ధనియాకుల వీరమ్మ, పండితాపురం

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబైన శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయం

ఖమ్మం సహకారనగర్ : నగరంలోని వీడీవోస్ కాలనీలో గల శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయ ఐదో వార్షికోత్సవాలను సోమవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. నేడు (19వ తేదీ) ఉదయం 6:30 గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం, రామచంద్రస్వామి వారి మూలవిరాట్‌కు పంచామృత తిరుమంజనం, గోపూజ, అగ్ని ప్రతిష్ఠాపన, వాస్తుపూజ, హోమం, మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 6 : 30 గంటలకు నిత్యహోమం, అంకురార్పణ, మత్స్యంగ్రహణం(పుట్టమట్టితో పూజ), ధ్వజారోహణం, బలిహరణం, నీరాజన మంత్రపుష్పం అనంతరం తీర్థప్రసాద వినియోగం ఉంటాయని వివరించారు. 20వ తేదీ ఉదయం 7 గంటలకు విశ్వక్సేన ఆరాధనతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకం, నవగ్రహ స్థాపన, నవకుంభారోహణ, రామనామ తారకమంత్ర వాహనం, బలిహరణం, నీరాజన మంత్రపుష్పం ఉంటాయని, రాత్రి 7 గంటలకు శ్రీ సీతారామచంద్రస్వామి వారి తిరుకల్యాణ మహోత్సవం, అనంతరం అన్నప్రసాద కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. 21వ తేదీ ఉదయం 8 గంటలకు నిత్య ఆరాధన, చూర్ణోత్సవం, చక్రస్నానం శాంతిహోమం, పూర్ణాహుతి, తీర్థప్రసాద వినియోగం, సాయంత్రం 6:30 గంటలకు ద్వాదశ ప్రదక్షిణ, ఆరాధన, ధ్వజావరోహణ, మహదాశీర్వచనం అనంతరం స్వామివారి ఏకాంత సేవ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ నిర్వాహకులు గుంటుపల్లి శ్రీనివాసరావు, చెరుకూరి రమేష్, ఏపూరి మధుసూధన్, వెంకటేశ్వర్లు, భవనాసి విశ్వనాథం కోరారు.

నేడు పగిడిద్దరాజు పయనం..

పడగలతో కాలినడకన మేడారం బయల్దేరనున్న అరెం వంశీయులు

గుండాల: సమ్మక్క భర్త, అరెం వంశీయుల ఇలవేల్పు పగిడిద్దరాజు మేడారం జాతరకు పయనమవుతున్నాడు. అరెం వంశీయులు సోమవారం పడగలతో కాలికడనకన బయల్దేరనున్నారు. రెండేళ్లకోసారి ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో జరిగే సమ్మక్క -సారలమ్మ జాతరకు పగిడిద్దరాజును గుండాల మండలం యాపలగడ్డ నుంచి తోడ్కొని వెళ్తారు. సోమవారం పగిడిద్దరాజు గర్భగుడి వద్ద పడగలకు(జెండాలకు), శివసత్తులకు, పురాతన ఆభరణాలకు వడ్డెలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం గిరిజన నృత్యాలు, డప్పు వాయిద్యాల నడుమ పగిడిద్దరాజును తీసుకొని మేడారం వెళ్తారు. జాతర ముందురోజు(మంగళవారం) జంపన్న వాగులో బస చేస్తారు. బుధవారం పగిడిద్దరాజును గద్దెలపై ప్రతిష్ఠించాక జాతర ప్రారంభమవుతుంది. జాతర ముగిశాక అరెం వంశీయులు పగిడిద్దరాజును పాదయాత్రతో గుండాలకు చేర్చుతారు. కాగా యాపలగడ్డలో పగిడిద్ద రాజు-సమ్మక్కల నాగవెళ్లి జాతరను మార్చి మొదటి వారంలో నిర్వహిస్తామని అరెం వంశీయులు తెలిపారు.

పగిడిద్దరాజును దర్శించుకున్న మేడారం జాతర ట్రస్ట్ చైర్మన్

యాపలగడ్డలో ఆదివారం పగిడిద్దరాజును మేడారం జాతర ట్రస్ట్ చైర్మన్ అరెం లచ్చు పటేల్ దర్శించుకున్నాడు. పూజారులు, వడ్డెల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మార్చి మొదటి వారంలో జరిగే జాతర అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క పగిడిద్దరాజు జాతర అభివృద్ధికి రూ. 16 లక్షలు మంజూరు చేశారని, ఆ నిధులతో మరుగుదొడ్లు, బోరు, గర్భగుడి అభివృద్ధి పనులు చేపడతామని వివరించారు. అనంతరం లచ్చు పటేల్‌ను ఏటీఎఫ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో అరెం కాంతారావు, అబ్బయ్య, నాగయ్య, సత్యం, రమణ, రామారావుతోపాటు ఏటీపీ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి కుబ్బాకుల రవి, ఉండం నాగేందరావు, కుంజ క్రిష్ణ, మోకాళ్ల రామచంద్రు, వట్టం లింగరాజు, పాయం ఆనందరావు, చాపల రమేష్‌బాబు, రవి కుమార్, సమ్మక్క తల్లి పూజారి సిద్దబోయిన స్వామి, కొర్స రాజేష్, ఇర్ప సునీల్ తదితరులు పాల్గొన్నారు.

జాతరకు ప్రత్యేక బస్సులు షురూ..



ఖమ్మం కొత్తబస్టాండ్ నుంచి బస్సులు ప్రారంభిస్తున్న సీఐ, ఆర్ఎం

ఖమ్మం మామిళ్లగూడెం : మేడారం జాతరకు ఖమ్మం కొత్త బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులను ఆర్ఎం సీహెచ్ వెంకన్న, టూటౌన్ సీఐ బాలకృష్ణ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు వెంకటాపురం, మంగపేట, ఏటూరునాగారం ప్రాంతాల నుంచి ఈనెల 25 వరకు ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఖమ్మం డీఎం .బి.శ్రీనివాస్ మాట్లాడుతూ మేడారం జాతర సందర్భంగా ఇతర ప్రాంతాలకు కొన్ని పల్లెవెలుగు బస్సులతో పాటు ఎక్స్‌ప్రెస్‌లు తిరిగే రూట్లలో ట్రిప్పులు తగ్గించినట్లు తెలిపారు. రోజువారీ ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకొని సహకరించాలని కోరారు. ఖమ్మం నుంచి మేడారం వరకు పెద్దలకు రూ.480, పిల్లలకు రూ.250, ఇల్లెందు నుంచి పెద్దలకు రూ.270, పిల్లలకు రూ.150 టికెట్ ధరగా నిర్ణయించినట్లు వివరించారు.

లింక్ బస్సులు రద్దు..

ఈ నెల 20 నుంచి 23 వరకు విలేజ్ లింక్ బస్సులు రద్దు చేస్తున్నట్లు డీఎం తెలిపారు. బీకే బంజర, కోమట్లగూడెం, తిమ్మారావుపేట, ఏన్కూర్, కేవీస్కూల్, వీవీపాలెం, ఎం.వెంకటాయపాలెం, వెంకటగిరి, తెల్దారుపల్లి, గొల్లగూడెం, జలగం నగర్ , రాంనర్సయ్య నగర్, అనంతసాగర్, జక్కేపల్లి, సోలిపురం బస్సులు రద్దు చేస్తున్నట్లు వివరించారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

ఒకరోజు ఆదాయం రూ.30,455



బోట్ షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ : పాల్వంచ మండల పరిధిలోని కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీగా తరలివచ్చారు. డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులో దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 451 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.16,295 ఆదాయం లభించగా, 230మంది బోటుషికారు చేయడం ద్వారా పర్యాటకాభివృద్ధి సంస్థకు రూ.14,160 లభించాయని నిర్వాహకులు తెలిపారు.

జిల్లా స్థాయి పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంగాంధీచౌక్ : ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను పురస్కరించుకుని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో వ్యాసరచన, నినాదం, పోస్టర్ అనే మూడు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. 'నేను రాత్రికి రాత్రే మిలియనియర్ గా మారితే, ఆ డబ్బును ఎలా ఉపయోగిస్తాను' అనే అంశంపై 300 పదాలతో ఇంగ్లిష్, తెలుగు, హిందీ భాషల్లో వ్యాసం రాయవచ్చని తెలిపారు. నినాదం విభాగంలో 'పొదుపు మరియు చక్రవడ్డీ యొక్క శక్తి' అనే అంశంపై, పోస్టర్ విభాగంలో 'డిజిటల్, సైబర్ పరిశుభ్రత' అనే అంశంపై చేతితో కానీ, డిజిటల్‌గా కానీ వేయొచ్చని వివరించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు పోటీలకు అర్హులేనని తెలిపారు. విద్యార్థి పేరు, ప్రభుత్వ లేదా ప్రైవేటు పాఠశాల/కళాశాల పేరు, వయసు, ఫోన్ నంబర్ తప్పనిసరిగా దరఖాస్తులో పేర్కొనాలని సూచించారు. జిల్లా స్థాయిలో ఈ మూడు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతి, సర్టిఫికెట్ ప్రదానం చేస్తామని, వారు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత పొందుతారని తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఈ నెల 22 సాయంత్రం 5 గంటల లోపు జిల్లా లీడ్ బ్యాంక్ కార్యాలయానికి చేరేలా పోస్ట్ లేదా ఈమెయిల్ leadbankkhammam@yahoo.com ద్వారా వ్యాసం, నినాదం, పోస్టర్లను పంపించాలని సూచించారు.

అలరించిన 'కౌసల్యా సుప్రజా రామా'



కౌసల్య సుప్రజా రామా నాటికలో సన్నివేశం

ఖమ్మంగాంధీచౌక్: నెలనెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి కొలకనూరుకు చెందిన శ్రీ సాయి ఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'కౌసల్యా సుప్రజా రామా' నాటిక ప్రేక్షకులను అలరించింది. పురాణాలకు, సమాజాలకు ఒక ధర్మం ఉంటుంది. అలాగే వేదాలకు, ఓంకార నాదాలకూ ఒక ధర్మం ఉంటుంది. ఇక అమ్మ మనసుకు కూడా ఓ ధర్మం ఉంటుందని తెలిపేదే ఈ నాటిక అని నిర్వాహకులు పేర్కొన్నారు. అనాడు కౌసల్య అడవులకు వెళ్తున్న రాముడికి అడ్డుపడలేక పోయిందని, ఆమె అడ్డుపడితే తన భర్త దశరథుడి మాటను ధిక్కరించినట్టవుతుందనే ఉద్దేశంతోనే ఆగిపోయిందని, అయినా తల్లి మనసు మాత్రం బిడ్డలను అంటిపెట్టుకునే ఉంటుందనే నాటికి సారాంశమని వివరించారు. ఈ సందర్భంగా రాయల్ డ్యాన్స్ కూచిపూడి నృత్యాలయం మాస్టర్ సతోషిణి రెడ్డి బృందం చేసిన నృత్యం ఆకట్టుకుంది. అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ(ఆర్ట్స్) అధ్యక్షుడు మోటమర్రి జగన్మోహన్ రావు అధ్యక్షతన జరిగిన సభలో న్యాయవాది మందడపు శ్రీనివాస్, డాక్టర్ శరత్‌చంద్ర, ముక్కపాటి కోటేశ్వరరావు, ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షుడు డాక్టర్ నాగబత్తిని రవి, ప్రజానాట్యమండలి అధ్యక్ష, కార్యదర్శులు నామా లక్ష్మీనారాయణ, సదానందం తదితరులు పాల్గొన్నారు. కూచిపూడి నృత్య కళాకారులకు మెమెంటోలు అందజేశారు.

విద్య, వైద్యం అందాలి

- గిరిజనులకు మేలు జరిగేలా ప్రణాళికలు..
- గురుకులాల బలోపేతానికి కృషి
- ఐటీడీఏ పాలకవర్గ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి
- జీవనోపాధికి ప్రోత్సాహం : మంత్రి వెంకటరెడ్డి
- కొండరెడ్లపై దృష్టి పెట్టాలి : మంత్రి తుమ్మల



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పక్కన మంత్రులు కోమటిరెడ్డి, తుమ్మల, భద్రాద్రి, ఖమ్మం కలెక్టర్లు ప్రియాంక, గౌతమ్, పీఓ ప్రతీక్ జైన్, ఎస్పీ రోహిత్‌రాజు తదితరులు

భద్రాచలంఅర్బన్: గిరిజనులకు విద్య, వైద్యం, ఉపాధి కల్పించేలా ఐటీడీఏ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. గిరిజన కుటుంబాలకు మేలు జరిగేలా ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలన్నారు. భద్రాచలంలో ఆదివారం నిర్వహించిన ఐటీడీఏ పాలకవర్గ సమావేశంలో ఆయన రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి మాట్లాడారు. గిరిజనులు జీవన స్థితిగతులు మెరుగుపడాలంటే విద్యాభివృద్ధి జరగాలన్నారు. రెసిడెన్షియల్, ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. గిరిజన విద్యార్థుల ఉన్నత చదువులకు తోడ్పానందిస్తామని తెలిపారు. ఉపాధి కల్పించేందుకు ప్రతి మండలంలో ఫ్రూట్ ప్లాంటేషన్ ద్వారా పండ్ల తోటల పెంపకం చేపడతామని, అధిక శాతం నిధులు కేటాయించి ఆయిల్ పామ్ సాగుకు ఆర్థిక వెసులుబాటు కల్పిస్తామని వివరించారు. ధరణి కమిటీ నివేదిక వచ్చాక గిరిజన గ్రామాల్లోని పట్టాదారు పాస్ పుస్తకాల సమస్యలు కూడా పరిష్కరిస్తామన్నారు. భద్రాచలం వద్ద గోదావరి కరకట్టను పెంచేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుంటూ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలన్నారు.

యువతను ప్రోత్సహిస్తాం

నిరుద్యోగులైన గిరిజన యువత జీవనోపాధి పెంపొందించుకునేలా ఐటీడీఏ ద్వారా వృత్తి శిక్షణ ఇప్పించి, ప్రోత్సహిస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. ఇందుకోసం మ్యాక్స్ సంస్థ ద్వారా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఇంటర్, పదో తరగతి వరకే చదువుకున్నవారికి ఐటీడీఏ వైటీసీ ద్వారా వివిధ రకాల శిక్షణ ఇస్తుండటం హర్షణీయమని పేర్కొన్నారు. ఇంకా నిష్ణాతులైన ఫ్యాకల్టీతో శిక్షణ ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామన్నారు. భద్రాచలం, మధిర, కొత్తగూడెం, ఖమ్మం, ఇల్లెందు మండలాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

గిరిజన సంక్షేమానికి పెద్దపీట

గిరిజన సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మారుమూల ఆదివాసీ గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, రోడ్ల సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొండరెడ్ల కుటుంబాలు అధికంగా ఉన్న అశ్వారావుపేట మండలం పూసుకుంట, గోగులపూడి గ్రామాలతోపాటు వారి నివాస ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు.

అర్హులకు పథకాలు అందేలా..

భద్రాచలం ఐటీడీఏ ద్వారా అర్హులైన గిరిజనులకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. ఆదివాసీ గ్రామాల్లో విద్యా, వైద్యం, ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ట్రైకార్ ద్వారా 80 శాతం సబ్సిడీతో రుణాల మంజూరు చేస్తున్నామని చెప్పారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ భద్రాచలం ప్రభుత్వాస్పత్రిని వైద్యుల కొరత వేధిస్తోందని, దీంతో గిరిజనులు వైద్య అందక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణమే ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఇక్కడి ఆస్పత్రిలో సేవలందించేందుకు వైద్యులు ముందుకు వచ్చేలా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లా చెందిన ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ఆయా నియోజకవర్గాల్లోని సమస్యలను వివరించారు. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ తర్వాత ట్రైకార్ లబ్ధిదారులకు రూ.1.29 కోట్ల చెక్కును మంత్రులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ కవిత, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల, ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్, ఎస్పీ రోహిత్‌రాజ్, పినపాక, కొత్తగూడెం, ఇల్లెందు, అశ్వారావుపేట, వైరా ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, కూనంనేని సాంబశివరావు, కోరం కనకయ్య, జారే ఆదినారాయణ, మాలోత్ రాందాస్ , ఎమ్మెల్సీ తాతా మధు, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గిరిజన ప్రాంతం అభివృద్ధి చెందుతుంది



పాండురంగాచార్యులును సన్మానిస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: కొవ్వూరు రైల్వే లైన్ ఏర్పాటైతే గిరిజన ప్రాంతం అభివృద్ధి చెందుతుందని కొవ్వూరు రైల్వే లైన్ సాధన కమిటీ కన్వీనర్ కొదమసింహం పాండురంగాచార్యులు తెలిపారు. ఆదివారం కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ వరకు శంకుస్థాపన పనులు జరగనున్నాయని, రైల్వే లైన్ కోసం 1984 నుంచి పోరాటం చేశామని, గిరిజన ప్రాంతం అభివృద్ధితోపాటు ప్రస్తుతం వైజాగ్ నుంచి హైదరాబాద్‌కు 150 కిలోమీటర్ల దూరం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో బాలరాజు సత్యనారాయణ, చలిగంటి శ్రీనివాస్, బానోత్ ధర్మ, గోపాల్‌రావు, ఈశ్వరయ్య, హనుమంతరావు, పవన్‌కల్యాణ్, కల్లూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కరుణాకర్

ఇల్లెందు: గంజాయి విక్రయదారులపై కఠిన చర్యలుంటాయని ఇల్లెందు సీఐ టి.కరుణాకర్ హెచ్చరించారు. ఆదివారం ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి నుంచి భద్రాచలం, ఇల్లెందు మీదుగా హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని వాహన తనిఖీల్లో భాగంగా పట్టుకున్నామన్నారు. మల్కన్‌గిరి, కోరాపుట్‌కు చెందిన గణేశ్వర్‌పూజారి, సత్యమార్గి సుమారు 12 కిలోల గంజాయిని తరలిస్తూ దొరికారని, గంజాయి విలువ సుమారు రూ.2.40 లక్షలు ఉంటుందని చెప్పారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అప్పారావు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

జూలూరుపాడు: వ్యక్తి అదృశ్యంపై స్థానిక పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ జీవన్‌రాజు కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం దంతలమామిడి గ్రామానికి చెందిన వంతెన మహదేవ్ (38) గ్రామస్తులు రామకృష్ణ, శ్రీరాములు, విజయ్‌కుమార్‌తో కలిసి ఈ నెల 10న జూలూరుపాడు మండలం సూరారం అటవీ ప్లాంటేషన్ పనుల నిమిత్తం వచ్చాడు. అదే రోజు సాయంత్రం ఎవరికీ చెప్పకుండా వంతెన మహదేవ్ వెళ్లిపోయాడు. అతని కోసం ఎక్కడ వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో ఫారెస్టు ప్లాంటేషన్ మేనేజర్ టి.రాజేంద్రకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

ఖమ్మంరూరల్: మండలంలోని నాయుడుపేట బ్రిడ్జి కింద పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను రూరల్ పోలీసులు శనివారం అర్ధరాత్రి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాయుడుపేటలో నూకల నర్సింహారావు, పి.రాజేష్, ఎస్.చంటి, చానబోయిన సతీష్, ఆట కిషోర్, బండి నవీన్ సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో నగదు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్నారని, తమకు అందిన సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామని తెలిపారు. వారి నుంచి రూ.5,880 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

సీతారామ కెనాల్‌లో ట్రాక్టర్ బోల్తా



సీతారామ కెనాల్‌లో బోల్తా పడిన ట్రాక్టర్

అశ్వాపురం: మండలంలోని మొండికుంట గ్రామ శివారులో మొండికుంట – తుమ్మలచెరువు రహదారిపై సీతారామ కెనాల్ వంతెన వద్ద ఆదివారం ట్రాక్టర్ బోల్తా పడింది. గొందిగూడెం గ్రామానికి చెందిన ట్రాక్టర్‌ను డ్రైవర్ కాటబోయిన సురేశ్ నడుపుకుంటూ తుమ్మలచెరువు నుంచి మొండికుంట వస్తుండగా సీతారామ కెనాల్ వద్ద అదుపుతప్పి అందులోకి పల్టీకొట్టింది. డ్రైవర్‌కు గాయాలుకాగా, స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.12,595

మన నీళ్లు మంచివే!

- కాలుష్యరహితంగా భూగర్భ జలం
- నీటి నాణ్యతను పరీక్షించిన భూగర్భజల శాఖ
- జిల్లాలోని నాలుగు మండలాల్లో 51 నీటి నమూనాల సేకరణ
- పరీక్షల అనంతరం సాగుకు ఉపయుక్తమేనని నిర్ధారణ



వ్యవసాయ బావి నీటి నమూనాలు సేకరిస్తున్న భూగర్భజలశాఖ అధికారులు



చేతిపంపు నుండి శాంపిళ్లు సేకరిస్తున్న అధికారులు

ఖమ్మంవన్‌టౌన్: మొక్కలు ఏపుగా పెరగాలంటే సారవంతమైన భూమితో పాటు తగినంత నాణ్యమైన నీరు కూడా అవసరమే. నీటిలో నాణ్యత లేకపోతే నేల ఎంత సారవంతంగా ఉన్నా పంటలు పండడం కష్టమవుతుంది. కానీ కొందరు రైతులు అవగాహన లేక రసాయన ఎరువులు విచ్చలవిడిగా వినియోగిస్తూ అటు నేల, ఇటు నీటిని కలుషితం చేస్తున్నారు. ఈ నేపథ్యాన జిల్లాలో నీరు ఎంతమేరకు కలుషితమైంది, సాగుకు ఈ నీరు ఎలా ఉపయోగపడుతుందనే అంశాన్ని పరీక్షించేందుకు భూగర్భజలశాఖ అధికారులు పరీక్షలు నిర్వహించారు. ఇటీవల జిల్లాలోని నాలుగు మండలాల్లో అక్కడక్కడా శాంపిళ్లు సేకరించి పరీక్షల అనంతరం నివేదికలు సిద్ధం చేశారు.

51 నీటి నమూనాల పరిశీలన

గతంలో నీటి నాణ్యతను పరిశీలించేందుకు శాంపిళ్లు సేకరించి హైదరాబాద్ పంపించేవారు. కానీ భూగర్భ జలవనరుల శాఖకు ఇటీవల సంచార వాహనం అందుబాటులోకి వచ్చింది. దీంతో ఈ వాహనం ద్వారా ఖమ్మం రూరల్ మండలంలోని ఎం.వెంకటాయపాలెం, తీర్థాల, రఘునాథపాలెం మండలంలో పాపటపల్లి, కామేపల్లి మండలంలో పండితాపురం, ఈర్లపూడి ఏన్కూరు మండలంలో తిమ్మారావుపేట, సింగరేణి మండలంలో రేలకాయలపల్లిల్లో 51 నమూనాలు సేకరించారు. ఈ నీటిని 13 రకాల పరీక్షలు నిర్వహించి నాణ్యతను నిర్ధారించారు.

మోతాదులోనే రసాయనాలు

జిల్లాలో తొలిసారిగా సంచార వాహనంలో వివిధ మండలాలకు తిరుగుతూ బోర్లు, బావులు, చేతిపంపుల నుంచి నీటి నమూనాలను సేకరించి నాణ్యతా పరీక్షలు నిర్వహించారు. భూగర్భజల శాఖాధికారులు నిర్వహించిన నీటి నమూనాల పరిశీలనలో మోతాదులోనే రసాయనాలు ఉన్నాయని తేలింది. వీటిని సాగుకు వాడడం వలన పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లదని అధికారులు పేర్కొన్నారు. నమూనాలు సేకరించి నీటి నాణ్యతను విశ్లేషించగా అందులో నత్రజని, సల్ఫేట్, ఫ్లోరైడ్, కాల్షియం, మెగ్నీషియం, కార్బనేట్, బై కార్బనేట్, క్లోరైడ్‌లు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) మోతాదులోనే ఉన్నాయని తేల్చారు. ఫలితంగా 90శాతం నీరు వ్యవసాయానికి అనుకూలంగా ఉందని పేర్కొన్నారు. నత్రజని ఉండడం మూలంగా మొక్కలు ఏపుగా, కిరణజన్య సంయోగక్రియ జరిపి పత్రహరితం ఏర్పాటులో ఉపయోగపడుతుంది. మిగితా మూలకాలు సైతం ఉండాల్సిన మోతదులోనే ఉండడం వలన సాగుకు ఇవి ఎంతగానో తోడ్పడనున్నాయి.

మావోయిస్టుల ఇలాకాలో త్రివర్ణ పతాకం

- 40 ఏళ్ల తర్వాత ఎగురవేసిన పోలీసులు
- మావోయిస్టు నేత హిడ్మా తల్లిని పరామర్శించిన ఉన్నతాధికారులు



మావోయిస్టు నేత హిడ్మా తల్లితో పోలీసు ఉన్నతాధికారులు



పువ్వర్తి పోలీస్ క్యాంప్ ఎదుట ఎగురవేసిన జాతీయ పతాకం

చర్ల: మావోయిస్టు ఇలాకాలో పోలీసులు త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేశారు. మావోయిస్టులకు పెట్టని కోటగా ఉన్న సుక్మా జిల్లా జేగురుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పువ్వర్తి ప్రాంతంలో సుమారు 4 దశాబ్దాల తరువాత ఆదివారం జాతీయ జెండా ఎగరడం తమ విజయంగా పోలీసులు చెబుతున్నారు. వారం రోజుల క్రితం ఇక్కడ ఏర్పాటు చేసిన పోలీస్‌క్యాంపులో సీఆర్‌పీఎఫ్, డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, కోబ్రా విభాగాల బలగాలను ఏర్పాటు చేశారు. ఈ గ్రామానికి చెందిన మడివి హిడ్మా 1996లో తన 16 యేళ్ల ప్రాయంలో మావోయిస్టు పార్టీలో చేరి తొలుత గ్రామ కమిటీలో పని చేశాడు. ఆ తర్వాత దర్భా డివిజన్ కార్యదర్శిగా, పీఎల్‌జీఏ మొదటి బెటాలియన్ కమాండర్‌గా, సెంట్రల్ కమిటీ మెంబర్‌గా అంచెలంచెలుగా ఎదిగాడు. అతడు 35కు పైగా దాడుల్లో పాల్గొన్నట్లు తెలుస్తుండగా హిడ్మా నేతృత్వంలో తాడిమెట్లలో జరిగిన దాడిలో 76 మంది జవాన్లు, బుర్కాపాల్‌లో జరిగిన దాడిలో 24 మంది జవాన్లు మృతి చెందారు. ఇతనిపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూ. 25 లక్షల రివార్డు ప్రకటించింది. అతడికి ప్రస్తుతం మావోయిస్టు పార్టీ నాలుగంచెల భద్రత కల్పిస్తోంది. హిడ్మాతో పాటు ప్రస్తుతం పీఎల్‌జీఏ మొదటి బెటాలియన్‌కు కమాండర్‌గా కొనసాగుతున్న బాడ్సె దేవా కూడా ఇదే గ్రామానికి చెందిన వాడు. కాగా వీరి స్వగ్రామం మూడు జిల్లాలకు సరిహద్దులో దట్టమైన అటవీ ప్రాంతంలో ఉండడంతో ఆ ప్రాంతం మావోయిస్టులకు నిలయంగా మారింది. ఈ క్రమంలో మావోయిస్టులను కట్టడి చేసే క్రమంలో ఛత్తీస్‌గఢ్‌లోని బీజేపీ ప్రభుత్వానికి కేంద్రం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుండడంతో దండకారణ్యంలో పెద్ద ఎత్తున పోలీసు క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం పువ్వర్తిలో పోలీసు క్యాంపు ఏర్పాటు చేయగా ఆదివారం మావోయిస్టు నేత మడవి హిడ్మా తల్లిని సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ ఎస్పీ కిరణ్ చౌహాన్, కోబ్రా కమాండెంట్ ఉపేంద్ర పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పువ్వర్తితో పాటు సమీపంలోని అన్నీ గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. సంఘ విద్రోహ శక్తుల నుంచి పూర్తి భద్రత కల్పిస్తామని స్థానికులకు భరోసా ఇచ్చారు. హిడ్మా స్వగ్రామమైన పువ్వర్తిలో పోలీసు క్యాంపును ఏర్పాటు చేయగా మావోయిస్టులకు గతంలో గట్టి పట్టున్న గ్రామాలైన పువ్వర్తి, కొరగట్ట, మీనగట్ట, జబ్బగట్ట, కంచాల, గుండ్రాయి తదితర గ్రామాలన్నీ ఇప్పుడు పోలీసుల ఆధీనంలోకి వచ్చినట్టయింది.

రిసెప్షన్‌కు తరలిన ప్రముఖులు



వధూవరులతో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, తుమ్మల, కోమటిరెడ్డి తదితరులు



వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

కల్లూరు/కల్లూరురూరల్: మండలంలోని నారాయణపురం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాదరెడ్డి తనయుడు లోహిత్‌రెడ్డి వివాహ రిసెప్షన్‌కు ప్రముఖులు తరలివచ్చారు. ఈ నెల 14న బహ్రెయిన్‌లో వివాహం జరిగగా.. తన స్వగ్రామమైన నారాయణపురంలో వివాహ రిసెప్షన్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఆర్‌అండ్‌బీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు డాక్టర్ మట్టా రాగమయి, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వచ్చిన అతిథులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్నిచర్యలు చేపట్టారు. పోలీసులు, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు ట్రాఫిక్‌ను నియంత్రించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన వాహనాలకు సుమారు 50 ఎకరాలను పార్కింగ్‌కు కేటాయించారు.

కష్టపడ్డారు.. కొలువు కొట్టారు

డిగ్రీ, జూనియర్ కళాశాలల పీడీగా అర్హత సాధించిన ఇద్దరు



గడ్డం రాము

పాల్వంచరూరల్: ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న వ్యక్తి మరో రెండు ఉద్యోగాలకు అర్హత సాధించాడు. పాల్వంచ పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన గడ్డం రాము లక్ష్మీదేవిపల్లి మండలం చింతవర్రె గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. డిప్యూటేషన్‌పై పాల్వంచ పట్టణంలోని ఎర్రగుంట పాఠశాల్లో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర గురుకుల బోర్డు నిర్వహించిన పరీక్షలు రాశాడు. గత మంగళవారం ఫలితాలు విడుదల కాగా, గురుకుల డిగ్రీ కళాశాల పీడీగా, జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్‌గా ఎంపికయ్యాడు. గురువారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నాడు. కాగా డిగ్రీ కళాశాల పీడీగా చేరుతున్నట్లు రాము తెలిపారు. ఈ సందర్భంగా రామును డీఈఓ వెంకటేశ్వరాచారి, ఎంఈఓ జూంకీలాల్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు, పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి బి.రాము, మైలారం హెచ్‌ఎం.రాజ మొగిలి తదితరులు అభినందించారు.

గిరిజన మహిళకు రెండు ఉద్యోగాలు..



సీఎం చేతులమీదుగా నియామకపత్రం అందుకుంటున్న కమల

సుజాతనగర్: ఓ గిరిజన మహిళ రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి పలువురి మన్ననలను పొందుతోంది. మండల పరిధిలోని సీతంపేట బంజర గ్రామానికి చెందిన లావుడ్యా కమలకు వివాహం కాగా ఇద్దరు సంతానం. భర్త ప్రోత్సాహంతో 2023 ఆగస్టులో గురుకులాల బోర్డు నిర్వహించిన పోటీ పరీక్షలు రాసింది. ఒకేసారి గురుకుల డిగ్రీ, ఇంటర్ కళాశాలలో పీడీ(ఫిజికల్ డైరెక్టర్) రెండు పోస్టులకు ఎంపికైంది. ఈ నెల 13న హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాన్ని అందుకుంది. డిగ్రీ కళాశాలలో పీడీగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టనున్నట్లు కమల తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణం మధురబస్తీకి చెందిన వై.శ్రీనివాస్ (40) పురుగుల మందు తాగి.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. వై.శ్రీనివాస్‌కు ఆరేళ్ల కిందట వివాహం జరగగా మూడేళ్ల కిందట భార్య పుట్టింటికి వెళ్లింది. తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీనివాస్ పురుగులమందు తాగాడు. స్థానికులు ఆయన్ను ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య?

నేలకొండపల్లి: మండలానికి చెందిన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని బోదులబండకు చెందిన పి.పూర్ణ (22) ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. కాగా, ఆత్మహత్యకు గల కారణాలు తెలియకపోగా.. స్థానిక పోలీస్‌స్టేషన్‌లోనూ ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

మేడారం వెళ్తూ గుండెపోటుతో వ్యక్తి మృతి



భిక్షం మృతదేహం

కూసుమంచి: స్నేహితులతో కలిసి మేడారం జాతరకు బయలుదేరిన ఓ వ్యక్తి గుండెపోటుతో మృతిచెందిన ఘటన ఆదివారం మండలంలో ఈశ్వరమాధారం వద్ద చోటుచేసుకుంది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన ఎనిమిదిమంది స్నేహితులు నాలుగు ద్విచక్ర వాహనాలపై మేడారం జాతరకు వెళ్తున్నారు. ఈక్రమంలో మండలంలోని ఈశ్వరమాధారం సమీపంలోని బ్రిడ్జి వద్దకు భిక్షం (49)కు హఠాత్తుగా గుండెపోటు వచ్చింది. మిగిలినవారు ఆయన్ను ఆస్పత్రికి తరలించేలోగా అక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనతో స్నేహితులు విషాదంలో మునిగిపోగా భిక్షం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. కాగా, ఈ ఘటనపై తమకు ఎలాంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో మహిళ...

తిరుమలాయపాలెం: మిర్చి తోటల్లో కాయలు ఏరేందుకు వచ్చిన మహిళా కూలీ గుండెపోటుతో మృతి చెందిన ఘటన మండలంలోని పాపాయిగూడెంలో ఆదివారం చోటుచేసుకుంది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయిగూడెం గ్రామానికి చెందిన అంబటి గీతాంజలి (30) ఆదివారం మండలంలోని పాపాయిగూడెం గ్రామంలో రేపాకుల అరుణకు చెందిన మిర్చి తోటలో కాయలు ఏరేందుకు గ్రామస్తులతో కలిసి వచ్చింది. మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా కళ్లు తిరిగి పడిపోయింది. దీంతో ఆమెను తిరుమలాయపాలెం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కి తీసుకెళ్లగా మృతిచెందింది. మృతురాలికి భర్త ఉపేందర్ కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతురాలికి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వ్యక్తి...

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. స్థానిక ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను కథనం ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలం గొల్లగూడేనికి చెందిన పంపర్ల నాగరాజు (43), ఇతని స్నేహితుడు పోలిన నారాయణ కలిసి ఈ నెల 12వ తేదీన మేడారం జాతరకు వెళ్లారు. తిరిగి ఈ నెల 14వ తేదీన తమ గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం కాలనీ వద్ద వేగంగా దూసుకొచ్చిన జేసీబీ అదుపుతప్పి ఢీకొట్టిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగరాజును విజయవాడ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య శంకుతలదేవి ఫిర్యాదుతో జేసీబీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ శాఖ ఉద్యోగి...



నివాళులర్పిస్తున్న ట్రాన్స్‌కో డీఈ రామారావు, ఏడీ తిలక్

చింతకాని: మండలంలోని కొదుమూరు గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆర్టిజన్ గ్రేడ్–2 ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్న చింతకాని గ్రామానికి చెందిన అమర్లపూడి రమేశ్‌బాబు అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. మృతదేహాన్ని ట్రాన్స్‌కో డీఈ నంబూరి రామారావు, ఏడీ తిలక్, చింతకాని ఏఈ వెంకన్న తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

హెచ్‌ఎంలకు సభ్యత్వం అందజేత



సభ్యత్వాలు అందచేస్తున్న టీజీవోస్ నాయకులు కస్తాల, మోదుగు

ఖమ్మంసహకారనగర్: తెలంగాణ గెజిటెడ్ అసోసియేషన్ (టీజీవోస్) సభ్యత్వాన్ని ఆదివారం సుమారు 100 మంది హెడ్‌మాస్టర్లకు అందించినట్లు టీజీవోస్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధానోపాధ్యాయులకు సంఘం అండగా ఉంటుందన్నారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.వీరస్వామి, నాయకులు రమేశ్, భాస్కర్, హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.

వైరాలో రోడ్డు ప్రమాదం

గాయపడిన స్పెషల్ బెటాలియన్ డీఎస్పీ



ప్రమాదంలో కారు, లారీ ఢీకొన్న దృశ్యం

వైరా: రెండు కార్లు, లారీ ఢీకొన్న ఘటన వైరాలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో సత్తుపల్లి గంగారం స్పెషల్ బెటాలియన్ డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు గాయపడ్డా రు. ఖమ్మం నుంచి వైరా వైపు వస్తున్న కారు వైరా విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద తల్లాడ వైపు నుంచి వస్తున్న కారును అతి వేగంతో ఢీకొట్టి.. అదే వేగంతో ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న సత్తుపల్లి స్పెషల్ బెటాలియన్ డీఎస్పీ ఎం.శ్రీనివాసరావుతో పాటు తల్లాడ వైపు నుంచి వస్తున్న కారులోని వ్యక్తి కూడా తీవ్రంగా గాయపడ్డారు. ఈ సందర్భంగా రోడ్డుపై వాహనాలు భారీగా నిలిచి పోవడంతో ట్రాఫిక్ నిలిచి పోయింది. వైరా ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తులను ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కామేపల్లి: పాన్యేకల్ గ్రామంలో తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చావిటి మల్లేశ్ ఈ నెల 14న బంధువుల ఇంట్లో వివాహానికి కుటుంబ సమేతంగా వెళ్లాడు. తిరిగి శనివారం ఇంటికి వచ్చే సరికి తాళం పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని దుస్తులు చిందరవందరంగా పడి ఉన్నాయి. అంతేకాకుండా బీరువాలోని రూ.3.20 లక్షలు, 3 తులాల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించి ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఖమ్మం నుంచి క్లూస్ టీం వచ్చి ఘటనా స్థలంలో వేలిముద్రలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలాజీ నగర్‌లో...

సుజాతనగర్: తాళం వేసిన ఓ ఇంట్లో జరిగిన చోరీపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. స్థానిక బాలాజీనగర్‌కు చెందిన కొట్టి చంద్రయ్య అనారోగ్యానికి గురికావడంతో భార్యతో కలిసి ఈ నెల 13న ఆస్పత్రికి వెళ్లాడు. ఆదివారం ఉదయం ఇతని ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో అనుమానం వచ్చిన స్థానికులు సమాచారం అందించారు. రుద్రంపూర్‌లో ఉండే చంద్రయ్య కుమారుడు వచ్చి ఇంటిని పరిశీలించగా బీరువా తెరిచి ఉండటంతో పాటు, సామగ్రి చిందరవందరగా పడిఉన్నాయి. బంగారు ఉంగరం, చెవి దిద్దులు, వెండి కుందులు, కుంకుమ భరణి చోరీకి గురైనట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ జుబేదాబేగం చోరీ జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

రెండు టన్నుల చేపలు లూటీ



చెరువులో ప్రజలు చించి పడేసిన వలలు

నేలకొండపల్లి: చెరువులోని చేపలను తమకు విక్రయించకలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకంగా చేపలను లూటీ చేశారు. ఈ ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని చెరువుమాధారం చెరువులో రెండు రోజుల నుంచి మత్స్యకారులు చేపల వేట సాగిస్తున్నారు. తమకు విక్రయించాలని ప్రజలు డిమాండ్ చేయడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. సొసైటీ బాధ్యులు ప్రజలకు విక్రయించేందుకు చర్యలు తీసుకుంటుండగానే ప్రజలు ఆగకుండా చెరువులోకి దూసుకెళ్లారు. అప్పుడే చెరువులో చేపలను మత్స్యకారులు ఒడ్డుకు చేర్చడంతో వలలను చించేసి, అందులోని చేపలను లూటీ చేశారు. దాదాపు 2 టన్నుల వరకు చేపల లూటీ జరిగి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. విషయం తెలుసుకున్న పలు గ్రామాల ప్రజలు చెరువు వైపు వస్తుండటంతో మత్స్యకారులు చేసేదేమీలేక చేపల వేటను అర్ధంతరంగా నిలిపివేశారు. ఈ విషయంపై సొసైటీ పాలవర్గం.. సంబంధిత అధికారులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు.